

14న ప్రభుత్వ ఐటిఐలో అప్రెంటీస్ మేళా

ధవళేశ్వరం : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 14న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాను నిర్వహిస్తున్నామని ఐటిఐ ప్రిన్సిపల్ జివి రమణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే మేళాలో రాజమహేంద్రవరంలోని ప్రముఖ కంపెనీల్లో వివిధ ట్రేడులలో సుమారు 200 అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఐటిఐలో వివిధ ట్రేడులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ప్రొఫైల్, ఒక జత జిరాక్సు కాపీలతో హాజరుకావాలన్నారు. మేళాకు హాజరగు అభ్యర్థులు అప్రెంటిస్ ఐబిఎం పోర్టల్ https://dgt.gov.in/appmela2022లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అదే రోజు తొమ్మిది గంటలకు స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేస్తారన్నారు. వివరాలకు 8919796259, 9848738841 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వరిపై సుడిదోమ దాడి

భారీ నష్టాలతో అన్నదాతల ఆందోళన
ఆదుకోవాలని ప్రభుత్వానికి వినతి

ప్రజాశక్తి - గోకవరం

అన్నదాత ఆశలపై సుడిదోమ నీళ్లు జల్లింది. దిగుబడి ఆశాజనకంగా వస్తుందనుకునే సమయానికి సుడిదోమ దాడి చేసి రైతులను నిలువునా ముంచేసింది. కౌలు రైతులను అప్పుల ఊబిలోకి దించేసింది. ఇంత జరుగుతున్నా కనీసం అధికారులు పట్టించుకోకపోవడంతో, ప్రభుత్వం ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోకవరం మండలంలో పరిధిలో సుమారు 2,625 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది వరికి దోమకాటు ఉన్నప్పటికీ మందులు పిచికారి చేస్తే అదుపులోకి వచ్చేది. కాని ఈ ఏడాది దోమకాటు ఎక్కువగా ఉండటంతో ఎన్ని మందులు పిచికారి చేసినా పోవడం లేదు. దీంతో వరికి భారీగా నష్టం వాటిల్లుతోంది. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి దాపురించిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సైతం దీనిపై చేతులెత్తేసినట్లు రైతులు చెబుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువగా వరి సాగు చేస్తున్నారు ఎప్పుడూ లేని విధంగా మండలంలో ఈ దోమ కాటు తెగులు ఎక్కువగా ఉంది. ఈ వ్యాధి సోకిన పంట ఎండిపోతోంది.

ఐదేళ్ల కాలంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గోకవరం మండలంలో వరి పంట పొలాల్లో పర్యటించారు. సుడిదోమ తెగులు సోకినట్టు గుర్తించారు. పిల్ల పురుగు వరి దుబ్బు మొదలు భాగంలో రసం పీల్చడం వల్ల ఎండిపోతున్నాయని గింజల పాలు పోసుకునే దశలో దోమ ఆశిస్తే నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. 200 లీటర్ల నీటిలో అధికారులు సూచించిన పురుగుల మందులు పిచికారి చేస్తే నివారణ ఉంటుందని చెప్పి వెళ్లిపోయారు. వరి పంట కోత దశలో వచ్చి చెప్పడం వల్లఉపయోగం లేదని రైతులు అంటున్నారు. అయినప్పటికీ వారు చెప్పినట్టు మందులు పిచికారి చేసినా ఫలితం లేదని తెలిపారు. గోకవరం మండల రైతులు వ్యవసాయ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు



గోకవరంలో సుడిదోమ తెగులుతో ఎండిపోయిన వరి చేను

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. ముఖ్యంగా కౌలు రేటు గతంలో కంటే ఎక్కువ పెరిగింది. ప్రస్తుతం ఎకరాకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు చెల్లించినట్టు కౌలురైతులు చెబుతున్నారు. గతంలో వరికోత మిషన్‌కు గంటకి రూ.2 వేలు ఉండేది. ఈ ఏడాది దాన్ని రూ.3వేలు చేశారని రైతులు తెలిపారు. ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా అధికంగా పెరిగాయని తెలిపారు. ఎకరాకు రూ.40వేల వరకూ పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. అననుకూలంగా ఉంటే 15 నుంచి 25 బస్తాలు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది దోమ కాటు వలన రెండు ఎకరాలకు 15 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుడిదోమతో భారీ నష్టం

ఈ ఏడాది సుడిదోమ తెగులు ఎక్కువగా ఉంది. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. 30 ఎకరాలు వరి సాగు చేస్తున్నాను. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది 10 ఎకరాల్లో పంట సుడిదోమ కాటుకు గురైంది. ఈ ఏడాది సగానికి పైగా నష్టం వచ్చేలా ఉంది. కౌలు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి కనిపించట్లేదు.

- జి.శేషగిరి, కౌలు రైతు, ఆర్.ఎర్రంపాలెం

పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరలు

గతేడాది కంటే ఈ ఏడు పురుగు మందులు, ఎరువుల ధరల విపరీతంగా పెరిగిపోయాయి. కోత మిషన్ అద్దెను కూడా పెంచేశారు. పెట్టుబడులు కూడా ఎక్కువగా అయ్యాయి. వాతావరణం అనుకూలించినా చివరల్లో సుడిదోమతో భారీగా నష్టం వచ్చింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎం.నానిబాబు, కౌలు రైతు, గోకవరం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం...

పొలాలకు ఎరువులు పురుగుల మందులు ఎక్కువగా వాడటం వల్ల సుడిదోమ తెగులు వస్తుంది. మొదటి దశలో తూటాకు కషాయం పిచికారీ చేసే కోత వరకు నివారించొచ్చు. అయినప్పటికీ నివారణ లేకపోతే ఏమీ చేయలేము. సుడిదోమ వల్ల నష్టం వాటిల్లితే కోతలు తరువాత దిగుబడిని బట్టి అంచనా వేసి నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. ప్రస్తుతం మండలంలో ఆర్‌బికెల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుంది.

- పి.రాజరాజేశ్వరం, ఎఒ, గోకవరం



పూడ్చిన కాలువను పరిశీలిస్తున్న అధికారులు

పూడ్చిన కాలువను తవ్వకుంటే చర్యలు

ప్రజాశక్తి - గోపాలపురం

పూడ్చివేతకు గురైన తాడిపూడి మైనర్ కాలువను తిరిగి యథావిధిగా తవ్వకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఇరిగేషన్ ఎఇ షమ్మీ స్పష్టం చేశారు. శుక్రవారం గోపాలపురం శివారులో గల తాడిపూడి లిఫ్ట్ -2 సంబంధించి మైనర్ కాలువను ఒక రైతు పూడ్చివేయగా ఏఈ షమ్మీ, ఎస్ఐ రామకృష్ణ పూడ్చివేత గురైన కాలువను పరిశీలించారు. లిఫ్ట్-2 తాడిపూడి డి -2 సంబంధించి ఎం -2 మైనర్ (ఉప కాలువ) ను ఇటీవల ఒక రైతు తన పొలం పరిధిలో కాలువను సుమారు 600 మీటర్లు పొడవు 18 మీటర్ల వెడల్పు పూర్తిగా తొలగించి చదును చేశారు. ఆ ప్రాంతంలో పొగాకు నాట్లు వేసేందుకు తయారు చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చిన అధికారులతో ఆ రైతు మాట్లాడుతూ పూడ్చివేసిన కాలువను తిరిగి తవ్వేందుకు రెండు నెలలు గడువు కావాలనికోరారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం వాటర్ రెగ్యులేషన్ జరుగుతుందని పంట పొలాలకు నీరు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నట్లు తెలిపారు. మూడు రోజులు గడువు ఇచ్చారు. 14లోగా కాలువను యథావిధిగా తవ్వకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ముఖ్యమంత్రి జగన్ వాలంటీర్, సచివాలయాల వ్యవస్థల ద్వారా అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నారని హోం మంతి తానేటి వనిత అన్నారు. శుక్రవారం కొవ్వూరు 20వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కరోనా వంటి విపత్కర సమయంలోనూ సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్.జగన్‌కే దక్కిందన్నారు. అనంతరం ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. నామినేటడ్ పదవుల్లో 50 శాతం మహిళలకే కేటాయించారన్నారు. వాలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలవాలన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం వైసిపి నాయకులు, మాజీ ఎంఎల్‌సి కోడూరి శివరామకృష్ణ, జడ్‌పి వైస్ ఛైర్మన్ పోసిన శ్రీలేఖ, కొవ్వూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ మన్నే పద్మ, తహశీల్దార్ బి.నాగరాజునాయక్, మున్సిపల్ కమిషనర్, బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న మంత్రి వనిత

ఘనంగా యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినం

ప్రజాశక్తి - బిక్కవోలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బిక్కవోలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యూనియన్ బ్యాంకు శాఖలో జరిగిన కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఎ.ఉదయ్‌రవికిరణ్ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుల మధ్య కేక్ కట్ చేసి వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రవికిరణ్ మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యమైన సేవలను అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ మేనేజర్ బి.నాగేంద్ర, అసిస్టెంట్ మేనేజర్ వివి.రమణ, ఆర్‌డిఒ సిహెచ్.శ్రీకాంత్ సాహు, బ్యాంక్ సిబ్బంది నిర్మల, స్వప్న, సుబ్బరామయ్య పాల్గొన్నారు.



వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న మేనేజర్ ఉదయ్‌రవికిరణ్, సిబ్బంది

పాఠ్య పుస్తకాల అందజేత

తాళ్లపూడి : మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 8,361 మందికి సెకండ్ సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలను శుక్రవారం హెచ్‌ఎంలకు విద్యాశాఖ అధికారులు అందించారు. భాషేతర పాఠ్యపుస్తకాలైన గణితం పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తకాలను అందజేశారు. తాళ్లపూడిలో శ్రీ పరస పద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్ వద్ద వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం సిబ్బంది రేణుక గంగాభవాని, రోజాబాబు, సిఆర్‌పి పద్మావతి, ఉపాధ్యాయులు నాని తదితరులు పాల్గొన్నారు.

బల్లిపాడులో పంటకోత ప్రయోగం

తాళ్లపూడి : మండలంలోని బల్లిపాడులో వల్లిపల్లి సతీష్ అనే రైతు సాగు చేస్తున్న వరి పంట పొలంలో శుక్రవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రయోగంలో ఎకరానికి 29 బస్తాలు దిగుబడి వచ్చినట్లుగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు లింగంకుంట సుధీర్, హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధి డి.పోసి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో రాధేయపాలేనికి మల్లిడి హరినాథ్ రెడ్డి(56) మృతి చెందాడు. శుక్రవారం హరినాథ్‌రెడ్డి రాజానగరంలో మార్కెట్‌కి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో సాయిబాబా గుడి సినిమా హాల్ సమీపానికి వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు.

వాడివేడిగా కడియం మండల సమావేశం

ప్రజాశక్తి -కడియం

కడియం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం వాడివేడిగా సాగింది. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు మాట్లాడారు. అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుర్రిలంక - వేమగిరి ఇసుక ర్యాంపులో జరుగుతున్న అక్రమ త్రవ్వకాలపై ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నా పట్టించుకోని ఆ శాఖ అధికారులు , చేతివాటం ప్రదర్శిస్తున్న విద్యుత్ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది తీరును ఎండగట్టారు. అభివద్ధిని గాలికొదిలేసిన అధికార వైసిపి అంటున్న ప్రతిపక్షం, అభివద్ధిని న్యాయస్థానాల ద్వారా అడ్డుకుంటున్నారంటూ అధికారపక్షం సభ్యులు ఆరోపణలు చేసుకున్నారు. మాదవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని రోడ్లు, కల్వర్టులు ఛిద్రమై ఏళ్లు గడుస్తున్న పట్టించుకునే నాధుడే లేడని సర్పంచ్ అన్నందేవుల చంటి ఆర్అండ్‌బి అధికారులను నిలదీశారు. గతంలోనే వీటి అభివద్ధికి ప్రతిపాదించగా ఆ రోడ్డు కల్వర్టు అవసరం లేదని కొత్తగా వచ్చిన ఎఇ కిరణ్ కుమార్ తెలపడంతో సర్పంచ్ చంటి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేవారు. సమావేశానంతరం సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆయన దగ్గరుండి గ్రామానికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ చంటి

12 నుంచి 'జగనన్న ఇళ్లు -పేదలకు కన్నీళ్లు'

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

ఈనెల 12,13,14 తేదీల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో 'జగనన్న ఇళ్లు -పేదలకు కన్నీళ్లు' అనే వినూత్న కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఇళ్లు పేరుతో నిర్మిస్తున్న జగనన్న కాలనీలు, గత టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులపై యుటిఎఫ్ హర్షం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

మున్సిపల్ ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లు, సెలవులు, మెడికల్ బిల్స్ పెన్షన్ ప్రతిపాదనలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల యుటిఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఇప్పటివరకు ఈ బిల్లులు మునిస్పల్ విద్యాశాఖ పర్యవేక్షణలో ఉండగా ఇప్పుడు పాఠశాల విద్యాశాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి డిఇఒ ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు.

'మార్గాని'కి యూనియన్ బ్యాంక్ పురస్కారం

ప్రజాశక్తి- కడియం

కడియపులంక వీరహనుమాన్ నర్సరీ అధినేత మార్గాని సత్యనారాయణకు యూనియన్ బ్యాంక్ 104 వసంతాలు సంధర్భంగా ప్రొగ్రెసివ్ నర్సరీ పురస్కారాన్ని కడియం బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ డి.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అందచేశారు. 2007లో కూడా ఇదే బ్యాంకు నుంఎతీ ప్రొగ్రెసివ్ నర్సరీ పురస్కారాన్ని అప్పటి గవర్నర్ ఎన్‌డి తివారీ చేతులమీదుగా మార్గాని అందుకున్నారు. ఈ సందర్భంగా మార్గానిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిబ్బంది రవికుమార్, రాజీవ్, వెంకటేష్, శివ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాద్ జయంతి

ప్రజాశక్తి- యంత్రాంగం


మౌలానా అబ్దుల్ కలామ్ జయంతిని శుక్రవారం జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **చాగల్లు** మండలం చంద్రవరం శాఖా గ్రంథాలయంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రామ పెద్దలు బండి సత్యనారాయణ, ఉపాధ్యాయులు నెక్కంటి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు కాసాని వెంకటేశ్వరరావు, ఎన్.సత్తిబాబు, విద్యార్థులు, లైబ్రేరియన్ పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలో అన్ని పాఠశాలల్లో ఆజాద్ జయంతిని నిర్వహించారు. తాడిపర్రు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సరోజిని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజానగరం** మండలంలోని నన్నయ విశ్వవిద్యాలయం ఈసీ హాల్‌లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతినినిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి.సురేష్ వర్మ, కె.శ్రీరమేష్, కె.రమణేశ్వరి, డాక్టర్.వి.పెర్సిస్, డాక్టర్.కె.సుబ్బారావు, డాక్టర్.కె.వి.స్వామి, డాక్టర్.ఎన్.ఉదయభాస్కర్, డాక్టర్.ఎం.గోపాలకష్ణ, డా.దమయంతి, సిఇఎస్.లింగారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పలువురి ఎంపిక

ప్రజాశక్తి -చాగల్లు, గోకవరం

మండలంలోని కలవలపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ముత్యాల వివిఎస్.లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, రన్నింగ్, షాట్ పుట్, జావెలిన్ త్రో, వాలీబాల్ విభాగంలో పలువురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కొయ్యే గంగాధర్‌రావు, విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ ెద్దలు, పిఎంసి సభ్యులు అభినందించారు. గోకవరం మండలం గుమ్మలదొడ్డి జడ్‌పి ఉన్నత పాఠశా విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీలో విశేష ప్రతిభ కనబర్చారు. వీరిలో ముగ్గురు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఉషారాణి తెలిపారు. విద్యార్థులను పిఎంసి ఛైర్మన్ పి.చిన్ని, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్టూ'నిజం'



ఆర్ట్స్ కళాశాలలో ఆర్థిక అవకతవకలు, కులవివక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆర్థిక అవకతవకలు, కులవివక్షతో కొట్టుమిట్టాడుతుందని రూల్ ఆంధ్రా మూమెంట్ ప్రెసిడెంట్ బర్రే ఆనంద్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 170 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాలకు ఎస్‌సి వ్యక్తి ఇంఛార్జి ప్రిన్సిపల్‌గా ఉండటాన్ని సంహించలేని కొన్ని శక్తులు ఆయనను తప్పించి బ్రాహ్మణ వ్యక్తిని ఇన్‌ఛార్జి చేయడం కోసం కొన్ని శక్తులు విద్యార్థులతో కుట్రలు చేయించాయన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆంజనేయులుపై కొందరు విద్యార్థులతో ఈనెల 9న ఆరోపణలు చేయించి నిముషాల వ్యవధిలోనే విచారణకు ఆదేశించారన్నారు. ఫిర్యాదు అందడానికి ముందురోజే ఆంజనేయులును తొలగించి సీనియారిటీ ప్రకారం బ్రాహ్మణ వ్యక్తిని నియమించడానికి లిస్టు తయారు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. స్టాఫ్ కౌన్సెలింగ్ రిజల్యూషన్, అకడమిక్ కౌన్సిల్ రిజల్యూషన్, గవర్నింగ్ బాడీ అనుమతులు లేకుండా రూ.కోట్లాది విలువచేసే సుమారు ఆరుఎకరాల భూమిని రాజమండ్రి అథ్లెటిక్ అసోసియేషన్‌కు ఎలా ధారాదత్తం చేశారని ప్రశ్నించారు. అర్బన్ స్క్వేర్ పార్కుకు కాలేజీ భూములను ఏ నిబంధన ప్రకారం ఇచ్చారన్నారు. కళాశాలకు ప్రతి ఏడాది ఫీజుల రూపంలో రూ.6కోట్ల వరకూ ఆదాయం వస్తుందన్నారు. గత ఐదేళ్ళుగా ఆడిట్ ఎందుకు నిర్వహించలేదన్నారు. రూ.40 లక్షలతో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసినప్పటికీ కరెంటు బిల్లు గతంకంటే ఎక్కువగా ఎందుకు వస్తుందని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి విషయాలను ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎస్‌సి కులానికి చెందిన ఆంజనేయులుపై వేటువేసి విచారణ జరిపించడం కులవివక్ష గానే భావిస్తున్నామన్నారు. ఇలాంటి అవకతవకలపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించాలని ప్రభుత్వానికి ఆనంద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కడియం : కడియం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను హెచ్‌ఎం టి.సత్యనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల విద్యార్థులు వారోత్సవాల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకూ వివిధ పోటీలు జరుగుతాయని,దీనికి సహకరించాలని శాఖా గ్రంథాలయాధికారి శ్రీదేవి నిర్మల కోరారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

కొనుగోలు కేంద్రం ప్రారంభం

దేవరపల్లి : దేవరపల్లి మండలం యర్నగూడెం సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.భరత్‌బాబు, వైసిపి నాయకులు ఎన్.రాజేంద్రబాబు, తహశీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపిడిఒ ఉమామహేశ్వరశర్మ, సొసైటీ అధ్యక్షులు, సొసైటీ సిటో ఎం.పెదబాబు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్యవాడలో ఫ్యామిలీ ఫిజీషియన్

ఉండ్రాజవరం : మండలంలోని సత్యవాడలో వేలివెన్ను పిహెచ్‌సి వైద్యాధికారి ఇర్ఫాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం నిర్వహించారు. 104 వాహన డాక్టర్ వెంకటేశ్వర్లు 41 మందికి వైద్య పరీక్షలు నిర్వమించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిహెచ్ఒ పి.బ్యూలాజాయ్, ఎఎన్ఎం సిహెచ్.దుర్గామల్లీశ్వరి, సూపర్‌వైజర్లు జె.శ్రీనివాసరావు, కె.నాగమణి, హెల్త్ అసిస్టెంట్ ఎ.విజయపమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

చాగల్లు : హార్టికల్చర్ విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చరల్ డీన్ డాక్టర్ పద్మావతి అన్నారు. శుక్రవారం నేలటూరు సీతారామస్వామి కళ్యాణ మండపంలో పార్వతీపురం, వెంకటరమన్న గూడెం ఉద్యానవన కళాశాల విద్యార్థులు ఏర్పాటుచేసిన వ్యవసాయ ఉద్యానవన పంటల ప్రదర్శనను పద్మావతి ప్రారంభించారు. ఉద్యానవన పంటల ఆవశ్యకత, తక్కువ కాలంలో నాణ్యమైన మేలైన దిగుబడి సాధించే విధానం, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. డ్రోన్ ద్వారా పురుగు మందులు చల్లడాన్ని చూపించారు. విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త జి.రామానందం, డాక్టర్ కె.మమత, అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రతైలుఉ పాల్గొన్నారు.

అయ్యన్నను కలిసిన మాజీ మంత్రి జవహర్

కొవ్వూరు రూరల్ : టిడిపి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కెఎస్.జవహర్ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడుని నర్సీపట్నంలో శుక్రవారం పరామర్శించారు. జవహర్ మాట్లాడుతూ అయ్యనన్నను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. టిడిపి కుటుంబం అంతా వెన్నంటి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి రాఘవులు, వేగి చిన్నా, కోడూరి ప్రసాద్, ఉప్పులూరి పార్థసారథి, బి.కాశీ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు మానవాత సాయం

తాళ్లపూడి: ఆసరా లేక ఒంటరిగా జీవిస్తున్న పెద్దేవం గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు చామర్తి సీతామహాలక్ష్మి, చామర్తి నాగసూర్యకష్ణవేణిలకు మండల మానవతా శాఖ రూ.5వేల సాయం శుక్రవారం అందించింది. వీరికి ఎటువంటి అవసరం వచ్చినా తమ సంస్థ ఆదుకుంటుందని మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా కార్యదర్శి సాయన సుబ్బారావు పూర్వపు అధ్యక్షుడు చంద్రధర గుప్త ఈసీ మెంబర్ సనపల రాజశేఖర్ సభ్యులు రాజా రమాదేవి వరప్రసాద్ శ్రీరామ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

ఉండ్రాజవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దమ్మెన్ను ఆర్‌బికెలో సర్పంచ్ గురజర్ల వీరవెంకటసత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. కళ్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. దళారీలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటిరోజు 100 బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతు సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


రైతులతో చర్చిస్తున్న దవులూరి దొరబాబు

సమస్యల పరిష్కారానికి 'పల్లె నిద్ర'


ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గ్రామంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి స్టేట్ హౌసింగు కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు చెప్పారు. ఉండూరులో శుక్రవారం నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు చెప్పిన సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారానికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఉప సర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు తాటికొండ అచ్చిరాజు (బాబ్జి), పలువురు మున్సిపల్ కౌన్సిలర్‌లు, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవరత్నాలు ప్రజలకు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం 10వ డివిజన్ దుమ్ములపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, అధికారులు, మాజీ కార్పొరేటర్లతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లారు. మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో అమలు చేసిన నవరత్న పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడే ఉన్న అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిఇ మాధవి, వాసుపల్లి కృష్ణ, గద్దేపల్లి దాసు, తిరిది జగన్నాథం, రాంబాబు, ఎరుపల్లి సీతారామ్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 14 నుంచి 20 వ తేదీ వరకు జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను 14న మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు ప్రారంభిస్తారని, ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొంటారన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు,19న మహిళా దినోత్సవం, 20న జరిగే ముగింపు సభలో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే మెరుగైన పారిశుధ్యం

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

మెరుగైన పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం ఉంటేనే ఆశించిన ఫలితాలు సాధ్యమని అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం అయన ఐదో సర్కిల్ 16, 19 డివిజన్‌లో గోళీలపేటలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తడి- పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. చెత్తను విభజించి ఇచ్చేందుకు వీలుగా మూడు డస్ట్ బిన్లను సమకూర్చామని, చెత్తను విడివిడిగా వాటిల్లోనే వేయాలని సూచించారు. అవగాహనా లేమి వల్ల అక్కడక్కడా చెత్తను కలిపి ఇవ్వడం, రోడ్లపై వేయడం, మరి కొంతమంది డ్రైనేజీల్లో వేస్తున్నారన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

'టిడిపి బలోపేతానికి కృషి చేయండి'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపి బలోపేతానికి కృషి చేయాలని పలువురు పిలుపు ఇచ్చారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం నేతలతో సమావేశం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తణుకు మాజీ ఎంఎల్ఎ అరిమిల్లి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం నాయకులకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడిపించే నాయకుడు చంద్రబాబు మాత్రమేనన్నారు.

కోరంగి ఫార్మసీలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవా దినోత్సవాల్లో భాగంగా జిల్లా జడ్జి పి.కమలాదేవి ఆదేశాల మేరకు సీనియర్ న్యాయవాది డాక్టర్ వైడి.వసంత ఆధ్వర్యంలో కళాశాల నుంచి కోరంగి పోలీస్ స్టేషన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పి.కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపల్ బి.భవాని, ఎఒ మాల సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాల విద్యార్థుల న్యాయ విజ్ఞాన ర్యాలీ

స్వమిత్వా సర్వేపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పెదపూడి

గ్రామాల్లో రోడ్లు, వీధులు, గృహాలు మొదలగు వాటిని డ్రోన్ కెమెరాతో చేస్తున్న స్వమిత్వా సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యరెడ్డి తెలిపారు. కాండ్రేగులలో శుక్రవారం సచివాలయ కార్యదర్శులు చేస్తున్న స్వమిత్వా సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వందేళ్ల క్రితం చేపట్టిన సర్వేను మరల కేంద్ర ప్రభుత్వం సర్వే చేస్తోందన్నారు. సర్వే అధికారులు సకాలంలో నిబంధనలు ప్రకారం సర్వేను పూర్తి చేయాలన్నారు. ఏమైనా సూచనలు, సలహాలకు తమను సంప్రదించాలన్నారు. సచివాలయం కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వైసిపి నేత ఫిర్యాదు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

తనకు ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గంగా భవాని భర్త, వైసిపి నేత గవర నాగేశ్వరరావు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. గురువారం కొత్తపల్లిలో విశ్రాంతి భవనం ప్రారంభం అనంతరం మాదిరెడ్డి దొరబాబుతో తనకు వివాదం నెలకొందని, ఈ వివాదంలో తనకు మద్దతుగా ఉన్నందుకు కొత్తపల్లి గ్రామానికి చెందిన గింజల శ్రీనుపై ఉప్పాడ పాత పంచాయతీ ఆవరణలో ఐదుగురు దాడికి పాల్పడ్డారని, పైగా తన సోదరుడైన రాంబాబుకు దొరబాబు ఫోన్ చేసి బెదిరించినట్టు తెలిపారు.

పెద్దాపురంలో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం 28వ వార్డు పరిధిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించినట్లు సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు తెలిపారు. సానిటరీ మేస్త్రీల ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది అందరూ ఈ వార్డు పరిధిలోని అన్ని వీధుల్లో సంపూర్ణ పారిశుధ్య పనులు నిర్వహించారన్నారు. రోడ్లను పరిశుభ్రం చేయడమే కాక అన్ని డ్రైన్లనూ పరిశుభ్రం చేశారన్నారు. ఈ పనులను ఆ వార్డు కౌన్సిలర్ పప్పల దుర్గ పరిశీలించారన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

క్రీడల్లో సెయింట్ జోసెఫ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సెయింట్ జోసెఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ మేరీ గ్రేస్ అభినందించారు. ఇటీవల ముమ్మిడివరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి అండర్ 14, అండర్ 17 బాలుర, బాలికల విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో షటిల్ బ్యాట్మంటన్‌లో జి.అఖిల్, పిస్.శ్యామలా అపూర్వ, ఖోఖోలో పి.భవిష్య అమత, ప్రేమ్ కుమార్, వాలీబాల్‌లో ఎస్.అభినవ వివేక్, పి.శ్రీవల్లి వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అరుణ, వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యపాల్, ఉపాధ్యాయులు శ్యామల, మేరీరోజ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్‌లో రూ.కోటీ 13 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి పథకానికి రక్షావారి పేటలో శంకుస్థాపన చేశారు. సిహెచ్‌సికి సంబంధించి బిసి హాస్టల్‌లో డెంగ్యూ వార్డు పక్కన ఏర్పాటు చేసిన బ్లడ్ స్టోరేజ్ బ్యాంకును ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి అరుణ, సుహాసినీదేవి, రెడ్డి బాబు, ఎంపిటిసి రచ్చ ముత్యాలు, చిట్టూరి లలిత పద్మ, నంది కోళ్ల శ్రీదేవి, ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కుడుపూడి శివన్నారాయణ పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

విశ్రాంత ఉపాధ్యాయుడు ఉద్దగిరి సోమరాజు తన తండ్రి జ్ఞాపకార్థం శుక్రవారం ఏలేశ్వరం ఆసుపత్రిలోని 60 మంది రోగులకు పాలు పండ్లు రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జిఎస్ఎస్‌కె.శైలజ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎడివి.ప్రసాద్, తూమురౌతు గురవయ్య, గంప శరణ్, ఉడతల రమణారావు వైద్య సిబ్బంది ఉన్నారు.

నేరాలు ఘోరాలు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

క్వారీల తవ్వకాల్లో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రౌతులపూడి

క్వారీ తవ్వకాల్లో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరొక ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇవి.. మల్లంపేట గ్రామ సమీపంలో తిరుపతమ్మ పేట వద్ద గల పెద్దగొడుపు కొండ ప్రాంతంలో శుక్రవారం క్వారీలో రాళ్ల తవ్వకాలు నిమిత్తం మల్లంపేట గ్రామస్తుడు గవిరెడ్డి నూకరాజు కూలి పనికి వెళ్లాడు. అయితే క్వారీ రాళ్ల తోస్తుండగా రాయి జారడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన రాయపు రెడ్డి భాస్కరరావు తో పాటు ఎస్ పైడిపల గ్రామానికి చెందిన గొంప శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన ప్రాంతానికి కోటనందూరు ఎస్ఐ స్వామి నాయుడు చేరుకొని ప్రమాదనికి గల కారణాలు స్థానికులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం రౌతులపూడి ప్రభుత్వా సుపత్రిలో ఉన్న గవిరెడ్డి నూకరాజు మృతదేహాన్ని ఎస్ఐ పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రి తరలించారు. నూకరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గాయాలు పాలైన వారిని మెరుగైన వైద్య సేవలు నిమిత్తం కాకినాడ తరలించారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సిఐ శివగణేష్

ఎంపిఎస్‌లో క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -మండపేట

స్థానిక మండపేట పబ్లిక్ స్కూల్ లో వార్షిక క్రీడా పోటీలను సిఐ శివ గణేష్ శుక్రవారం ప్రారంభించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు నిర్వహించిన పెరేడ్ లో ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోను రాణించాలన్నారు. క్రీడలు చదువునకు అదనపు అర్హత అన్నారు. క్రీడా పతా కాన్ని స్కూల్ కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి భవాని

ద్రాక్షారామంలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి -రామచంద్రపురం

ద్రాక్షారామ పంచా యతీ కార్యాలయము వద్ద శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపిపి అంబటి భవాని ప్రారంభించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలోని పేదలు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి జెడ్‌పిటిసి సభ్యుడు మెర్నీడి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, డాక్టర్ ప్రశాంతి, 104 డాక్టర్ కె. రజిత, సిహెచ్ఒ బి.వీరవేణి, ఎంపిహెచ్ఒ గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి - ఆలమూరు


మాట్లాడుతున్న డిఇ వర్మ

విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించ వచ్చునని రామచంద్రపురం డిఇ ధాట్ల శ్రీధర్ వర్మ అన్నారు. ఆలమూరు విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక టిటిడి కల్యాణమండపంలో విద్యుత్ సిబ్బందికి, భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు మండపేట ఎడిఇ జి.తిరుమలరావు, ఇంచార్జి ఎఇ వై.లక్ష్మిలతో కలసి వర్మ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గృహాలకు వైరింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా ఎర్త్ ను ఉపయోగి ంచాలన్నారు. అలాగే విద్యుత్ లైన్లలో సమస్యలు తలెత్తినప్పుడు సత్వరమే విద్యుత్ అధికారులను సంప్రదించాలన్నారు. నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయడం తోపాటు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ వి.సత్యనారాయణ, లైన్ మెన్లు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా నాయకుల పుట్టిన రోజు

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉప్పలగుప్తం పంచాయతీ చీకట్లపాలెంకు చెందిన చీకట్ల అబ్బాయి 86 వ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఆయన స్వగృహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అబ్బాయి పాపాయమ్మ దంపతులు పుట్టినరోజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు, అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్, పిసిసి సభ్యురాలు, అయితాబత్తుల సుభాషిని, మాజీ ఎంపిపి జోగి అర్జునరావు కాంగ్రెస్ నాయకులు వంటెద్దు బాబి, దోనిపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొని అబ్బాయి పాపాయమ్మ దంపతులను సత్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పుట్టినరోజు వేడుకలను శుక్రవారం భీమనపల్లిలో ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ ఇంటి వద్ద లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పుట్టినరోజు కేక్ ను రమణబాబు అభిమానులు ,పార్టీ కార్యకర్తలు మధ్య కట్ చేశారు.

హత్య కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

ప్రజాశక్తి- కరప/కాకినాడ కార్పొరేషన్

హత్యా నేరం రుజువుకావడంతో ఇద్దరు నిందితులకు జీవితఖైదు, ఒక్కొక్కరికీ రూ.5వేల జరిమానా, అంతేకాకుండా నేరాన్ని కప్పిపుచ్చినందుకు గాను మరో 3 ఏళ్ల జైలు శిక్ష, రూ. 5000 జరిమానా విధిస్తూ శుక్రవారం 4 వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలు ఇవి.. కరప గ్రామం పేకేటి సూర్యనారాయణకు పేపకా యలపాలెంకు చెందిన నాగలక్ష్మితో 2019లో వివాహమైంది. అయితే ఆమెకు వివాహానికి ముందే యువకుడు కర్రి రాధాకృష్ణతో సంబంధం ఉంది. అయితే ఒక పథకం ప్రకారం పెనుగుదురు గ్రామం లేఅవుట్లో సూర్యనారాయణ హత్య చేసి పంట బోదులో నెట్టి వేయడంతో ఈ విషయాన్ని మృతిని భార్య పేకేటి నాగలక్ష్మి కప్పి పుచ్చి ప్రియుడు రాధాకృష్ణకు సహకరించింది. దీనిపై మృతుని అన్నయ్య అయిన పేకేటి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ అప్పలరాజు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. సిఐ పి.ఈశ్వరుడు ఈ కేసును దర్యాప్తు చేశారు. నిందితులపై జిల్లా నాలుగవ అదనపు సెషన్స్ కోర్టు లో సిఐ ఆకుల మురళీకృష్ణ చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షాధారాలు పూర్తిగా రుజువు కావడంతో సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.కమలాదేవి పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున వాదించిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై. ప్రశాంతి కుమారి తదితరులను జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రబాబు అభినందించారు.

స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు నిరసనగా శుక్రవారం సీతానగరంలో సిపిఐఎంఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో నల్లజెండాలతో ఈ ర్యాలీ జరిగింది. వీరబాబు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.చిట్టిస్వామి, నాగరాజు, డి.పాపారావు, జి.అబ్బులు, రామకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

విలసవిల్లి పంచాయితీ గోకనవిల్లి లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.6.5లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులు, పంప్ హౌస్ నిర్మాణ పనులకు సర్పంచ్ సలాది ఊర్మిళ దేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సలాది సతీష్, గ్రామ పెద్దలు జంగా నాగమణి, ముషిని లింగేశ్వరావు, జంగా నాగేశ్వరావు బీర వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళా

పలుచోట్ల ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఉజిల్లాలో పలుచోట్ల ఉపాధి హామీ గ్రామసభలు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టే పనులను వివరించారు. **కపిలేశ్వరపురం** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలని గ్రామ సర్పంచ్ నాతి గవరయ్య అన్నారు. శుక్రవారం అద్దంకి వారిలంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామ సభల్లో పాల్గొని మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ శీలం రమాదేవి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టవలసిన ప్రణాళిక నివేదికను గ్రామ సభల్లో వివరించి వాటిపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సాకా శ్రీనివాస్, ఉప సర్పంచ్ గొల కోటి త్రిమూర్తులు, గ్రామ ప్రధాన కార్యదర్శి నాతి పట్టాభి, తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి** గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వర్తించాలని సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్ అన్నారు. శుక్రవారం విలస గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం పై నిర్వహించిన గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టవలసిన ప్రణాళిక నివేదిక వివరించారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ బి.ఆది శంకరం, ఉపాధి మేట్లు, పంచాయతి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **రాజోలు** సోంపల్లి, కూనవరం,శివకోటి గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులను పి.గన్నవరం క్లస్టర్ ఇంచార్జి ఎపిడి ఎండి.నాగ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పెంచాలని, ఉపాధి హామీ కూలీలు ఉదయం ఎనిమిది గంటలలోపు హాజరు అవ్వాలన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -అయినవిల్లి

అయినవిల్లి గ్రామ పెదపేట ఎంపిపి పాఠశాల్లో శుక్రవారం విద్యార్థులకు జలజీవన్ మిషన్, చేతుల పరిశుభ్రతపై కోనసీమ సేవ మండలి పి గన్నవరం డివిజన్ కోఆర్డినేటర్ బి.చందు, జి.సురేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, హ్యాండ్ వాష్ గురించి పలు అంశాలను వివరించారు. హెచ్ఎం బి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికే ఎఎన్ఎమ్ టి.లీలా కామేశ్వరి, ఆశ వర్కర్ వై.ధనలక్ష్మి దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌నకు ఘన స్వాగతం

ప్రజాశక్తి -అమలాపురం


మంత్రి విశ్వరూప్‌కు గజమాలతో సత్కారం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ శుక్రవారం జిల్లాకి విచ్చేసిన సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముంబైలో హార్ట్ బైపాస్ సర్జరీ చేయించుకుని హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్న మంత్రి విశ్వరూప్ రెండు నెలల తరువాత సొంత నియోజకవర్గం అమలాపురం స్థానిక కాటన్ అతిథి గహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ పూలమాలతో ఘన స్వాగతం పలిపారు. **అయినవిల్లి** మంత్రి పినిపే విశ్వరూప్ సతీసమేతంగా శుక్రవారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. హార్ట్ సర్జరీ చేయించుకుని హైదరాబాదులో చికిత్స పొందుతూ పూర్తిగా కోలుకుని స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా అయినవిల్లి విగ్నేశ్వర స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా పి.గన్నవరం ఎంఎల్ఎ చిట్టిబాబు తదితరులు మంత్రికి ఘన స్వాగతం పలికారు